ఎమ్మెల్యేలకు 100 కోట్ల ఆఫర్!

- కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నాలు
- ఎమ్మెల్యే రవికుమార్ ఆరోపణ

మాండ్య, ఆగస్టు 25: కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే రవికుమార్ గౌడ బీజేపీపై మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ 'ఆపరేషన్ కమలం'తో ప్రయత్నాలు చేస్తున్నదని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టేందుకు రూ.100 కోట్లు ఆఫర్ చేస్తున్నదని అన్నారు. అయితే బీజేపీ కుట్రలు ఫలించవని, తమ ప్రభుత్వం స్థిరంగా, బలంగా ఉన్నదని చెప్పుకొచ్చారు. మాండ్యలో ఆదివారం ఎమ్మెల్యే రవికుమార్ గౌడ మాట్లాడుతూ ఎమ్మెల్యేల కొనుగోలు కోసం బీజేపీ డబ్బుల ఆఫర్‌ను రూ.50 కోట్ల నుంచి రూ.100 కోట్లకు పెంచిందన్నారు. రెండు రోజుల క్రితం తనకు ఓ వ్యక్తి ఫోన్ చేశాడని, రూ.100 కోట్లు సిద్ధంగా ఉన్నాయంటూ ప్రలోభపెట్టే ప్రయత్నం చేశాడని పేర్కొన్నారు. 50 మందిని కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ వ్యక్తి చెప్పాడని తెలిపారు. తమ ప్రభుత్వాన్ని కూల గొట్టేందుకు బీజేపీ ప్రతి రోజూ కుట్రలు చేస్తూనే ఉన్నదని, ఆ పార్టీ 'బ్రోకర్లు తమ ఎమ్మెల్యేలను సంప్రదిస్తున్నారని అన్నారు. తనకు ఫోన్ చేసిన వ్యక్తి ఆడియో తన వద్ద ఉన్నదని, మిగతా ఆధారాలు కూడా సేకరించి ఈడీ, సీబీఐలకు ఇస్తామన్నారు. డబ్బు సంచులతో వారిని పట్టుకోవాలని అనుకొంటున్నామని తెలిపారు.

వాళ్లంతా ఒక గ్యాంగ్!

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, కేంద్ర మంత్రులు శోభా కరంద్లాజే, ప్రహ్లాద్ జోషి, హెచ్‌డీ కుమారస్వామిలు ఒక 'గ్యాంగ్'గా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే రవికుమార్ గౌడ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తామని వీరంతా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలకు హామీ ఇచ్చారని, ఆ లక్ష్యంతోనే పనిచేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఎర వేసేందుకు ఒక టీమ్ ప్రయత్నించిందని, రూ.50 కోట్ల డబ్బుతో పాటు మంత్రి పదవులు ఆఫర్ చేసిందని గత ఏడాది అక్టోబర్‌లో రవికుమార్ గౌడ చెప్పారు. నలుగురు ఎమ్మెల్యేలను ఈ విధంగా సంప్రదించారని, ఈ మేరకు తన వద్ద ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఖర్గే ట్రస్టుకు భూసంతర్పణ

> మొదటిపేజీ తరువాయి...

కేటాయించిందనే ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర రాజధాని బెంగళూరుకు సమీపంలోని హైటెక్ డిఫెన్స్ ఏరోస్పేస్ పార్క్‌లో కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డు(కేఐఏడీబీ)కి చెందిన 5 ఎకరాలను కేటాయించారన్న వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో మరో సంచలనంగా మారింది. ఈ వ్యవహారానికి సంబంధించి బీజేపీ రాజ్యసభ ఎంపీ లహర్ సింగ్ సిరోయా ఆదివారం పలు ఆరోపణలు చేశారు. కేఐఏడీబీకి చెందిన మొత్తం 45.94 ఎకరాల్లో ఖర్గే ట్రస్టుకు 5 ఎకరాలు కేటాయించారని ఆయన పేర్కొన్నారు. కేఐఏడీబీ భూమిని పొందేందుకు ఖర్గే కుటుంబం ఏరోస్పేస్ అంత్రప్రెన్యూర్లుగా ఎప్పుడు మారిందని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో భారీస్థాయిలో అక్రమాలు చోటుచేసుకొన్నాయని అనుమానాలు వ్యక్తం చేశారు.

ఏ విధంగా ఆమోదించారు?

'సిద్ధార్థ విహార ట్రస్టు'లో ట్రస్టీలుగా ఖర్గేతో పాటు ఆయన భార్య రాధా భాయ్, కుమారులు ప్రియాంక్ ఖర్గే(రాష్ట్ర మంత్రి), రాహుల్ ఖర్గే, అల్లుడు రాధాకృష్ణ(గుల్బర్గా ఎంపీ) తదితరులు ఉన్నారని ఎంపీ లహర్ సింగ్ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ప్రజల సౌకర్యాల కోసం ఉద్దేశించిన భూమిని ట్రస్టు ఎస్సీ కోటా కింద పొందిందని ఆయన ఆరోపించారు. ఇది అధికారి దుర్వినియోగం, బంధుప్రీతి కాదా? అని ప్రశ్నించారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఈ కేటాయింపునకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ ఏ విధంగా ఆమోదం తెలిపారని ప్రశ్నించారు. ఈ అక్రమ భూ కేటాయింపు వ్యవహారం ఒక ఆర్టీఐ కార్యకర్త ద్వారా గవర్నర్ కార్యాలయానికి కూడా చేరిందని ఆయన పేర్కొన్నారు. ఈ అక్రమ భూ కేటాయింపుపై విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

హెజ్బొల్లా డ్రోన్‌ను ధ్వంసం చేస్తున్న ఇజ్రాయెల్ ఆర్మీ రాకెట్

ఇజ్రాయెల్ రాకెట్ దాడులతో లెబనాన్ సరిహద్దుల్లో కమ్ముకొన్న పొగ, మంటలు

మళ్లీ భగ్గుమన్న పశ్చిమాసియా

- హెజ్బొల్లా, ఇజ్రాయెల్ పరస్పర దాడులు
- 100 ఫైటర్ జెట్లతో లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్ సైన్యం
- వందల రాకెట్లు, డ్రోన్లు ప్రయోగించిన హెజ్బొల్లా
- ఇజ్రాయెల్‌లో 48 గంటలపాటు ఎమర్జెన్సీ

జెరూసలేం, ఆగస్టు 25: పశ్చిమాసియా మళ్లీ భగ్గుమంది. లెబనాన్‌లోని హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూపు, ఇజ్రాయెల్ పరస్పర దాడులతో ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ఇప్పటికే కొనసాగుతున్న ఇజ్రాయెల్- హమాస్ యుద్ధం మరింత విస్తరించే అవకాశం ఉందన్న భయాందోళనలు నెలకొన్నాయి. గత నెలలో తమ టాప్ కమాండర్ హత్యకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ భూభాగంపైకి వందలాది సంఖ్యలో రాకెట్లు, డ్రోన్లను ప్రయోగించినట్టు హెజ్బొల్లా గ్రూపు ప్రకటించింది. ఉత్తర ఇజ్రాయెల్, గోలన్ హైట్స్‌లోని ఆ దేశ సైనిక స్థావరాలు, ఐరన్ డోమ్ లక్ష్యంగా చేసుకొని 320 కత్యూషా రాకెట్లు, భారీ సంఖ్యలో డ్రోన్లను ప్రయోగించినట్టు వెల్లడించింది. ప్రతీకార మొదటి దశ దాడులను ముగించామని, భవిష్యత్తులో మరిన్ని దాడులు ఉంటాయని పేర్కొన్నది. డ్రోన్లు 11 టార్గెట్లను నాశనం చేశాయని హెజ్బొల్లా పేర్కొన్నది. హెజ్బొల్లా దాడులను అడ్డుకొనేందుకు దక్షిణ లెబనాన్‌లోని వేలాది రాకెట్ లాంచర్లను లక్ష్యంగా చేసుకొని దాదాపు 100 యుద్ధ విమానాలు వైమానిక దాడులు చేశాయని ఇజ్రాయెల్ పేర్కొన్నది. దాదాపు ఉదయం 10 గంటల సమయానికి ఈ రెండు వైపుల దాడులు అగినప్పటికీ, పరిస్థితులు ఉద్రిక్తంగానే ఉన్నాయి. కేవలం సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసినట్టు హెజ్బొల్లా గ్రూపు, ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించాయి. ఇజ్రాయెల్ దాడుల్లో ముగ్గురు మరణించారని, ఇద్దరికి గాయాలయ్యాయని లెబనాన్ అధికారులు పేర్కొనగా, స్వల్ప నష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నామని ఇజ్రాయెల్ సైనిక అధికార ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. కాగా, హెజ్బొల్లా వద్ద దాదాపు 1,50,000 రాకెట్లు ఉన్నాయని, ఇజ్రాయెల్‌లోని అన్ని ప్రాంతాలపై దాడులు చేయగల సామర్థ్యం ఆ గ్రూపునకు ఉన్నదని ఒక అంచనా.

ఎయిర్‌పోర్టు మూసివేత.. సర్వీసుల మళ్లింపు

హెజ్బొల్లా దాడుల నేపథ్యంలో ఉత్తర ఇజ్రాయెల్‌లో ఎయిర్ రైడ్ సైరన్లు మోగాయి. బెన్-గురియోన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేశారు. దాడి ముప్పు నేపథ్యంలో గంట పాటు విమానాలను దారి మళ్లించారు. బాంబ్ షెల్టర్లకు సమీపంలో ఆశ్రయం తీసుకోవాలని ఇజ్రాయెల్ హోం ఫ్రంట్ కమాండ్ ప్రజలకు సూచించింది. ఇజ్రాయెల్-హమాస్ మధ్య గత 10 నెలలుగా సాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు మరో దఫా చర్చలను ఈజిప్టు నిర్వహిస్తున్న సమయంలో ఈ పరస్పర దాడులు చేసుకోవడం గమనార్హం.

ఇజ్రాయెల్‌లో 48 గంటల ఎమర్జెన్సీ

తాజా పరిణామాల నేపథ్యంలో ఇజ్రాయెల్‌లో 48 గంటల పాటు దేశవ్యాప్త ఎమర్జెన్సీ విధిస్తున్నట్టు ఆ దేశ రక్షణ శాఖ మంత్రి యోవ్ గాల్లంట్ ఆదివారం ప్రకటించారు. ఉదయం 6 గంటల నుంచి ఇది అమల్లో ఉంటుందని తెలిపారు. సైన్యం కీలక నిర్ణయాలు తీసుకొనేందుకు, ప్రజలు గూమిగూడకుండా నియంత్రించేందుకు ఈ చర్య చేపట్టినట్టు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్ పౌరులపై దాడులు చేసేందుకు హెజ్బొల్లా ప్రణాళికలు వేసిందని అంతకుముందు ఐడీఎఫ్ అధికార ప్రతినిధి డానియెల్ హగని పేర్కొన్నారు.

ప్రతిదాడులు తప్పవు: నెతన్యాహూ

తాజా పరిణామాల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. ఉత్తర ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించిన వేలాది రాకెట్లను సైన్యం అడ్డుకొన్నదని ఆయన పేర్కొన్నారు. సైన్యం సూచనలను పాటించాలని పౌరులను కోరారు. 'మా దేశాన్ని రక్షించుకొనేందుకు అన్ని చర్యలు తీసుకొంటాం. మాపై ఎవరు దాడి చేస్తారో, వారిపై మేం దాడి చేస్తాం అనే సాధారణ నియమాన్ని పాటిస్తున్నాం' అని స్పష్టం చేశారు.

హెజ్బొల్లా అమ్ములపొదిలో 'కత్యూషా'

హెజ్బొల్లా గ్రూపు అమ్ములపొదిలో 'కత్యూషా' అనేది ప్రధాన ఆయుధంగా ఉన్నది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో సోవియట్లు దీన్ని తయారు చేశారు. ఈ రాకెట్‌కు కత్యూషా అనే పేరు ఓ యుద్ధ పాట నుంచి వచ్చింది. కత్యూషా రాకెట్లు భారీ వార్ హెడ్‌లను సుదూర లక్ష్యాలపైకి ప్రయోగించగలవు. ఏకకాలంలో వందల సంఖ్యలో వీటిని ప్రయోగించే అవకాశం ఉండటంతో శత్రు లక్ష్యాలను నాశనం చేయగలవు. వీటిని కొన్ని రకాల రహస్య లాంచర్లపై ఉంచి గుర్తు తెలియని ప్రదేశాల నుంచి హెజ్బొల్లా ప్రయోగిస్తుంది. 2006లో లెబనాన్ యుద్ధంలో వీటిని భారీయెత్తున వినియోగించారు.

నీట్ పీజీ ఫలితాలు వివాదాస్పదం

- అంచనాలకు పర్సెంటైల్స్‌కు మధ్య పొంతన శూన్యం
- అభ్యర్థుల ర్యాంకులు, రోల్ నంబర్ల మధ్య తేడాలు
- పరీక్ష పారదర్శకతపై తీవ్రమైన అనుమానాలు

న్యూఢిల్లీ: నీట్ పీజీ-2024 ఫలితాలు ఆశావహులకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. చాలా మంది అభ్యర్థుల ఫలితాల్లో గణనీయమైన తేడాలు కనిపించడమే ఈ ఆందోళనకు కారణం. అంచనాల కంటే తమ పర్సెంటైల్స్ చాలా అధికంగా ఉన్నాయని, అసలు ఈ రెండింటికీ పొంతనే లేదని కొందరు విద్యార్థులు చెప్తుంటే.. నీట్ పీజీ ర్యాంకుకు సంబంధిత అప్లికేషన్ ఐడీ లేదా రోల్ నంబర్‌కు మధ్య తేడాలు ఉన్నట్టు మరికొందరు చెప్తున్నారు. మరోవైపు షిఫ్ట్-2లో పరీక్షకు హాజరైన పలువురు అభ్యర్థులకు మార్కులు గణనీయంగా తగ్గడం ఈ పరీక్ష పారదర్శకతపై తీవ్రమైన అనుమానాలను రేపుతున్నది. నీట్ పీజీ కటాఫ్‌ను ఎన్‌బీఈఎంఎస్ ఇంకా విడుదల చేయకపోవడం, ఆన్సర్స్ కీ లేదా జవాబు పత్రాలతోపాటు ఈ పరీక్షకు సంబంధించిన ఎలాంటి కంటెంట్‌ను షేర్ చేయబోమని ఎన్‌బీఈఎంఎస్ గతంలోనే స్పష్టం చేయడం విద్యార్థుల్లో ఆందోళనను మరింత పెంచుతున్నది. ఈ ఆందోళనకు తెరదించి నీట్ పీజీ ప్రవేశ పరీక్షపై విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు ఎన్‌బీఈఎంఎస్ పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని విద్యార్థులతోపాటు వైద్యులు, నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

పారిస్‌లో టెలిగ్రామ్ సీఈవో పావెల్ దురోవ్ అరెస్టు

ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే అదుపులోకి!

పారిస్: ప్రముఖ మెసేజింగ్, ఆడియో కాలింగ్ యాప్ 'టెలిగ్రామ్' వ్యవస్థాపకుడు, సీఈవో పావెల్ దురోవ్‌ను ఫ్రెంచ్ పోలీసులు అరెస్టు చేశారు. అజర్‌బైజాన్ నుంచి పారిస్‌కు చేరుకున్న ఆయన్ని శనివారం సాయంత్రం ఇక్కడి పారిస్ లె బోర్గెట్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నట్టు ఫ్రెంచ్ మీడియా పేర్కొన్నది. దురోవ్‌ను పోలీస్ కస్టడీలో ఉంచారని తెలిసింది. 'టెలిగ్రామ్' యాప్ మనీలాండరింగ్ కార్యకలాపాలకు ఉపయోగపడుతున్నదని, మైనర్లపై లైంగికదాడులు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు 'టెలిగ్రామ్'లోని కంటెంట్ దోహదపడుతున్నదని దురోవ్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

నటుడు దర్శన్‌కు జైలులో రాజ భోగాలు

బెంగళూరు: హత్య కేసులో నిందితుడు, కన్నడ నటుడు దర్శన్ తూగుదీపకు పరప్పన అగ్రహార కేంద్ర కారాగారంలో సకల రాజ భోగాలు అందుతున్నట్లు ఓ ఫొటోను బట్టి తెలుస్తున్నది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఈ ఫొటోను జైళ్ల శాఖ పరిగణనలోకి తీసుకుని, ఈ జైలు అధికారులకు సమన్లు జారీ చేసింది. ఫొటోలో కనిపిస్తున్న దానిని బట్టి, దర్శన్ జైలులోని ఓ పార్కులో జల్సాగా ఉన్నారు. ఏదో పానీయం తాగుతూ, సిగరెట్ కాల్చుతున్నారు. ఆయనతోపాటు కొందరు రౌడీ షీటర్లు కూడా పక్కన కనిపిస్తున్నారు.

మిస్ ఇండియా జాబితాలో దళితులేరీ?

రాహుల్‌గాంధీ ప్రశ్న

బాలబుద్ధి అని బీజేపీ విమర్శ

న్యూఢిల్లీ: మిస్ ఇండియా కిరీటాన్ని పొందినవారి జాబితాను తాను పరిశీలించానని, అందులో కనీసం ఒక దళిత లేదా ఆదివాసీ యువతి అయినా లేరని రాహుల్ గాంధీ అన్నారు. ఆయన శనివారం ప్రయాగ్ రాజ్‌లో సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్‌లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా స్పందించారు. 'మిస్ ఇండియా' పోటీలు, సినిమాలు, క్రీడల్లో రిజర్వేషన్లు ఉండాలని రాహుల్ కోరుకుంటున్నారని, ఇది కేవలం పసితనపు మనస్తత్వం వల్ల వచ్చిన సమస్య మాత్రమే కాదని, ఆయనను ప్రోత్సహిస్తున్నవారు కూడా సమానంగా బాధ్యులేనని వ్యాఖ్యానించారు.

యూపీ కానిస్టేబుల్ పరీక్షలో మళ్లీ అక్రమాలు!

లక్నోలో 20 మంది అరెస్టు

లక్నో: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల తీరు ఓ ప్రహసనంలా మారింది. ఆరు నెలల క్రితం ఏదైతే జరిగిందో.. మళ్లీ అదే రీతిలో పరీక్షల నిర్వహణ ఉందంటూ విమర్శలు వస్తున్నాయి. ఆగస్టు 23, 24 తేదీల్లో నిర్వహించిన పరీక్షల్లో నకిలీ పత్రాలు సహా పలు రకాల మోసపూరిత చర్యలకు పాల్పడ్డారన్న ఆరోపణల కింద 20 మందిని పోలీసులు అరెస్టు చేశారు. బిజ్‌నోర్‌లోని కేపీఎస్ కన్యా ఇంటర్ కాలేజ్‌లో సీల్ లేని ప్రశ్నా పత్రాలు అభ్యర్థులకు ఇచ్చారన్న ఫిర్యాదులు అందాయి. పేపర్ లీక్ అయ్యిందన్న అనుమానాలు కొంతమంది అభ్యర్థులు వ్యక్తం చేశారు. లక్నోలో లీకైన ప్రశ్నాపత్రంను చూపుతూ ఓ వ్యక్తి సోషల్ మీడియా 'ఎక్స్'లో వీడియోను విడుదల చేయటం కలకలం రేపింది. దీనికి సంబంధించి ఓ వ్యక్తిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. పరీక్ష నిర్వహణ పారదర్శకంగా లేదన్న ఆరోపణలు రావటంతో యోగి సర్కార్ ఫిబ్రవరిలో పరీక్షను రద్దు చేసింది. ఇప్పుడు మళ్లీ అదే విధంగా పరీక్షను నిర్వహిస్తున్నారంటూ వస్తున్న ఆరోపణల్ని 'యూపీ పోలీస్ రిక్రూట్‌మెంట్, ప్రమోషన్ బోర్డ్' చైర్‌పర్సన్ రాజీవ్ కృష్ణ కొట్టిపారేశారు. పేపర్ లీక్ సహా అక్రమాలపై వస్తున్న వార్తలన్నీ వదంతులేనని ప్రభుత్వం ఖండించింది.

అమెరికాలో కాల్పులు.. తెలుగు వైద్యుడు మృతి

- వైద్యరంగంలో పేరంశెట్టి రమేశ్‌బాబు విశేష సేవలు
- దవాఖానలు నిర్మించి అనేక మందికి ఉపాధి
- అమెరికాలో ఓ వీధికి ఆయన పేరు

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ)/న్యూఢిల్లీ: అమెరికాలో దుండగుడి కాల్పుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ప్రవాస వైద్యుడు డాక్టర్ పేరంశెట్టి రమేశ్ బాబు(64) మరణించారు. అలబామా రాష్ట్రంలోని టస్కలూసా పట్టణంలో శుక్రవారం జరిగిన ఈ కాల్పుల ఘటనలో రమేశ్ బాబు అక్కడికక్కడే మరణించారని స్థానిక పోలీసులు వెల్లడించారు. తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం మేనకూరు గ్రామానికి చెందిన డాక్టర్ పేరంశెట్టి రమేశ్‌బాబు అమెరికాలో ప్రముఖ వైద్యుడిగా ఉన్నారు. వైద్య వృత్తిలో ఆయనకు 38 ఏండ్ల అనుభవం ఉన్నది. అమెరికాలో పలుచోట్ల దవాఖానలు నిర్మించి ఎందరికో ఉపాధి కల్పించిన రమేశ్‌బాబు.. అలబామా రాష్ట్రంలోని టస్కలూసా ప్రాంతంలో వైద్యుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన వైద్య సేవలకు గుర్తింపుగా అక్కడి ఓ వీధికి ఆయన పేరు పెట్టారు. కొవిడ్ సమయంలోనూ ఆయన అందించిన విశేష సేవలకు పలు అవార్డులు అందుకొన్నారు. భారత్ నుంచి అమెరికా వెళ్లే రాజకీయ ప్రముఖులకు ఆయన తన ఇంట్లోనే ఆతిథ్యమిచ్చేవారు.

10 రోజుల క్రితమే వచ్చి వెళ్లి..

డాక్టర్ రమేశ్ బాబు తండ్రి చినగురునాథం సాధారణ రైతు. ఆయన ముగ్గురి సంతానంలో రమేశ్‌బాబు పెద్దవాడు. పదో తరగతి వరకూ సొంతూరులోనే చదువుకున్నారు. తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ అభ్యసించారు. అనంతరం జమైకాలో ఎమ్మెస్ పూర్తిచేసి, అమెరికాకు వెళ్లి వైద్యుడిగా స్థిరపడ్డారు. ఆయన భార్య కూడా వైద్యురాలే. వీరికి నలుగురు సంతానం. వీరిలో ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. వారంతా అమెరికాలోనే ఉంటున్నారు. ఆగస్టు 15న నాయుడుపేటలో తమ బంధువుల ఇంట జరిగిన వివాహానికి ఆయన హాజరయ్యారు. ఇక్కడ నుంచి వెళ్లిన కొద్ది రోజులకే ఆయన మరణ వార్త కుటుంబసభ్యులను దిగ్భ్రాంతికి గురిచేసింది. కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. డాక్టర్ రమేశ్ బాబు తాను చదువుకొన్న మేనకూరు హైస్కూల్‌కు, సొంత గ్రామంలో సాయిబాబా ఆలయ నిర్మాణానికి కూడా విరాళం అందించారు.

యూపీఎస్‌పై మాటల యుద్ధం

న్యూఢిల్లీ: 'యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్' (యూపీఎస్)పై అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఎన్డీయే సర్కార్ పలు నిర్ణయాలపై 'యూటర్న్' తీసుకుంటున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. యూపీఎస్‌లో 'యూ' అంటే యూనిఫైడ్ కాదని, యూటర్న్ అని ఎద్దేవా చేశారు. దీనిపై కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పందిస్తూ, యూపీఎస్ తీసుకురావటం కాంగ్రెస్‌కి కంటగింపుగా మారిందని అన్నారు. 'పాత పెన్షన్ విధానాన్ని తీసుకొస్తామని హిమాచల్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఎప్పుడు అమలుజేస్తారని రాహుల్ ని ప్రశ్నిస్తున్నా' అని కేంద్ర మంత్రి అన్నారు.

జీపీఎస్ ఫెయిలై.. సౌదీ ఎడారిలో చిక్కుకొని

- డీహైడ్రేషన్‌కు గురై మరణించిన కరీంనగర్ వాసి
- నాలుగు రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు

హైదరాబాద్: సౌదీ అరేబియా ఎడారిలో చిక్కుకుపోయిన కరీంనగర్ వ్యక్తి అత్యంత దయనీయ స్థితిలో ప్రాణాలు కోల్పోయాడు. నాలుగు రోజుల తర్వాత ఆయన మృతదేహాన్ని గుర్తించారు. 27 ఏళ్ల మొహమ్మద్ షేజాద్‌ఖాన్ సౌదీ అరేబియాలోని ఓ టెలిక మ్యూనికేషన్స్ కంపెనీలో మూడేళ్లుగా పనిచేస్తున్నాడు. సూడాన్‌కు చెందిన సహచర ఉద్యోగితో కలిసి ఇటీవల కారులో బయటకు వెళ్లిన షేజాద్ జీపీఎస్ సిగ్నల్ కోల్పోవడంతో దారి తప్పి ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర ఎడారిగా పేరుపొందిన రబ్ అల్ ఖలీ ఎడారిలో చిక్కుకుపోయాడు. 650 కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న ఈ ఎడారిలో ఎటునుంచి ఎటు వెళ్లాలో తెలియక ఇద్దరూ అవస్థలు పడ్డారు. దీనికితోడు ఫోన్‌లో చార్జింగ్ అయిపోయి స్విచ్ఛాఫ్ కావడంతో సాయం కోసం ఫోన్ చేసే అవకాశం కూడా లేకుండా పోయింది. కారులో పెట్రోలు కూడా నిండుకోవడంతో పరిస్థితి మరింత దిగజారింది. ఎడారిలో తిండితిప్పలు లేక, దాహం తీర్చుకునేందుకు చుక్క నీరు కనిపించకపోవడంతో అల్లాడిపోయారు. ఎడారి వేడికి డీహైడ్రేషన్‌కు గురై చివరికి అత్యంత దయనీయ స్థితిలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. నాలుగు రోజుల తర్వాత వీరి మృతదేహాలను వారి వాహనం పక్కనే గుర్తించారు.

ఢీకొన్న 9 వాహనాలు

తమిళనాడులో ఘటన.. ఒకరు మృతి

కృష్ణగిరి, ఆగస్టు 25: తమిళనాడు కృష్ణగిరి జిల్లాలోని ఓ జాతీయ రహదారిపై 9 వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హోసూర్-బెంగళూరు హైవేపై సవమవు అటవీ ప్రాంతం సమీపంలో ఫ్లైఓవర్ పనుల కారణంగా హోసూర్ నుంచి కృష్ణగిరి వెళ్తున్న వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఈ క్రమంలో గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ వాహనంపై అదుపుకోల్పోయి నాలుగు కార్లు, మూడు ట్రక్కులు, ఓ బస్సును ఢీకొట్టాడు.

ఫ్రెంచ్ ఫ్రైస్ తిననివ్వలేదని భర్తపై కేసు

బెంగళూరు: తనను కనీసం ఫ్రెంచ్ ఫ్రైస్ తిననివ్వటం లేదు, క్రూరంగా ప్రవర్తిస్తున్నాడంటూ బెంగళూరుకు చెందిన ఓ మహిళ తన భర్తపై పోలీసులకు ఫిర్యాదుచేసింది. దీంతో పోలీసులు 498ఏ, సెక్షన్-504 (ఉద్దేశపూర్వక అవమానం), వరకట్న నిషేధ చట్టం కింద కేసులు పెట్టారు. భర్త హైకోర్టును ఆశ్రయించటంతో దర్యాప్తును కోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. ఉద్యోగ నిమిత్తం అమెరికాకు వెళ్లేందుకు అతడికి అనుమతించింది. తదుపరి విచారణకు అందుబాటులో ఉంటానని అతడు అఫిడవిట్ దాఖలు చేశాడు. సరైన ఆధారాల్లేకుండా 498ఏ సెక్షన్ కింద కేసు పెట్టారని హైకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది.

చోరీకి వచ్చి బుక్కయిపోయాడు!

రోమ్: ఇటలీ రాజధాని రోమ్‌లో ఆసక్తికర ఘటన జరిగింది. ఓ దొంగ (38)ను ఓ ఇంట్లోని టేబుల్‌పై కనిపించిన పుస్తకం ఆకర్షించింది. దీంతో చోరీకి వచ్చానన్న విషయాన్ని మర్చిపోయి పుస్తకం చదవడంలో అతడు మునిగిపోయాడు. మెలకువ వచ్చిన యజమాని (71) వచ్చి అతడిని తడితే కానీ ఈ లోకంలోకి రాలేదు. ఆయనను చూసి షాకైన దొంగ పరారయ్యేందుకు ప్రయత్నించాడు. అయితే అప్పటికే అతడు పోలీసులకు దొరికిపోయాడు. దొంగను అంతగా ఆకర్షించిన ఆ పుస్తకం పేరు 'ది గాడ్స్ ఎట్ సిక్స్ ఓ క్లాక్'. గ్రీకు పురాణాలకు సంబంధించిన ఈ పుస్తకాన్ని ప్రముఖ రచయిత గియోవన్నీ నుచీ రాశారు.



ఆన్‌లైన్ గేమ్ ఆడనివ్వలేదని తాళాలు, కత్తి మింగేశాడు!

పాట్నా: ఆన్‌లైన్ గేమ్స్ మోజు ఓ వ్యక్తి ప్రాణాల మీదకు తెచ్చింది. ఓ బ్యాటిల్ గేమ్‌ను ఆడనివ్వలేదని ఓ వ్యక్తి తన కుటుంబ సభ్యుల మీద కోపంతో ఓ తాళం, తాళాల గుత్తి, ఓ కత్తి, రెండు నెయిల్ కట్టర్లను మింగేశాడు. కొన్ని గంటల తర్వాత ఆయన ఆరోగ్యం క్షీణించడం ప్రారంభమవడంతో కుటుంబ సభ్యులు ఆయనను దవాఖానకు తరలించారు. గంటన్నరసేపు శస్త్ర చికిత్స చేసి, ఆయన మింగినవాటన్నిటినీ వైద్యులు బయటకు తీశారు. ఇప్పుడు ఆయన పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం లేదని డాక్టర్ అమిత్ కుమార్ చెప్పారు. బీహార్‌లోని మోతీహారిలో ఈ సంఘటన జరిగింది.

కారులో హెల్మెట్ ధరించలేదని ఫైన్!

లక్నో: హెల్మెట్ ధరించకుండా కారు నడిపాడని యూపీలోని నోయిడా పోలీసులు జరిమానా విధించారు. బాధితుడు తుషార్ సక్సేనా మాట్లాడుతూ రూ.1,000 జరిమానా చెల్లించాలని గత ఏడాది నవంబరులో మెసేజ్ వచ్చిందని, అది పొరపాటున వచ్చిందేమోనని తాను పట్టించుకోలేదన్నారు. ఆ తర్వాత ఈ-మెయిల్, మెసేజ్‌లు రావడంతో పోలీసులను సంప్రదించానన్నారు. జరిమానా చెల్లించకపోతే కోర్టుకు రావలసి ఉంటుందని పోలీసులు తనను హెచ్చరించారని చెప్పారు. కారును నడిపేటపుడు హెల్మెట్ ధరించాలనే నిబంధన ఉంటే, అధికారులు లిఖితపూర్వకంగా తనకు ఇవ్వాలని కోరారు.

బ